

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

"స్టడీ"

ఓ నెలరోజులపాటు వీర లెవెల్లో పుస్తకాలు ముందేసుకుని చదివా. ఎందుకంటే ఎప్పుడూ క్లాసు ఫస్టు వచ్చేదాన్ని కాస్తా, మూడో క్వార్టర్లీలో నెంబర్ 2 కి పడిపోయా. మార్కుల గురించి మా యింట్లో పెద్దగా 'నస' పెట్టరనుకోండీ., కానీ నా ప్రిస్టేజీ కాస్త పలచబడింది. ఈసారి ఫస్టొచ్చిన వాళ్ళు ఎవరైనా పట్టించ్చుకునేదాన్ని కానేమోగానీ, వచ్చింది 'మేడబడి' పిల్లకి. అదీ కమలకుమారికి. దాని రాత కోడి కెలికినట్టుంటుందని ముందరే మనవి చేశాను గదా. మరి ఫస్టెలావొచ్చిందో నాకు అర్థం కాలేదు.

అప్పటికీ మామూలుగానే వున్నా. అది మాత్రం తెగ రెచ్చిపోయి యమా స్టైలుగా నా ముందు నిలబడి, "నంబర్ వన్ టు నంబర్ టూ... నంబర్ టు టూ నంబర్ ఫోర్ హీరోయిన్ టు జీరోయిన్.. యూ ఆర్ ది బిగ్గెస్ట్ పంప్ కిన్" అని పాట కూడా పాడింది. వాళ్ళ బాబాయి ఇంగ్లీషు లెక్చరరుట - అయితేనేం? దీనికి విషయం నెక్స్ట్ వీక్లీ టెస్టుల్నించీ చూడాలి. ఈ సీతతో పెట్టుకోవడం అంటే ఏమిటో యీ స్కూలు అంతటికీ చూపించాలి.

"నువ్వేమో చదివేస్తున్నావు. ఇంతవరకూ ఎలాగొలా కాపీకొట్టి పాసవుతున్నాం మేం. నీ పక్కనో నీ వెనకనో కూర్చునే ఛాన్సురాకపోతే ఎట్టాగే సీతా? ఫేలయితే మా నాన్న నన్ను గొడ్లకాపలాకి పంపుతాడు!" విచారంగా అన్నాడు డొంకాడోడు.

"సరేరా! క్లాసులు అయిపోగానే ఓ గంట అన్ని పాఠాలూ మనమే మళ్ళీ చదువుదాం. ఒకసారి కాకపోతే పదిసార్లు! అప్పుడు కాపీ కొట్టక్కర్లేదురా..!" సముదాయించా.

దీనికో కారణం వుంది. యీ మధ్య మా అమ్మకి భక్తి ఎక్కువైపోయి తెల్లకి తెల్లారుఝామునే లేచి గోవిందనామాలూ వేంకటేశ్వర సుప్రభాతం తెగ చదివేస్తోంది. మామూలుగా అయితే ఫరవాలేదు గానీ, గొంతెత్తి మరీ చదువుతోంది. వారం నించి పొద్దున్నే వింటూ వుండటం వల్ల వాటిల్లో చాలావరకు నాకు కంఠస్తం వచ్చేసినై. అలాగే ఇప్పుడు వీళ్ళకి నాలుగుసార్లు చదివి వినిపిస్తే మా పాకబడి బేచ్‌కి తిరుగుండదు అనుకున్నాను.

మరుసటిరోజునించే కంబైన్డ్ స్టడీ మొదలయింది. "ఒరే పార్వతీశం., నీవి మెల్లకళ్ళయినా మహా తీక్షణమైనవిరా. ఫుల్‌గా గట్టిగా 'మంచీ - చెడూ' పాఠాన్ని చదువు!" అన్నా.

వాడు పొంగిపోయి చదవటం మొదలెట్టాడు. అంతకుముందే మిగతావాళ్ళతో చెప్పాను. "కళ్ళుమూసుకుని, చెవులు మాత్రమే తెరిచి పాఠం వినండని."

ఆ తర్వాత జోగారావుని చదవమన్నా. ఆ తరవాత మద్ది మత్తెనగాడు ఇలా అందరూ విడివిడిగా ఒకే పాఠాన్ని ఆరుసార్లు చదవటంతో అందరికీ ఆ పాఠం కంఠోపాఠమైపోయింది. అలాగే సాంఘిక సామాన్య శాస్త్రాల పాఠాలుకూడా నమిలి మింగేశాం.

కొన్నాళ్ళకి అది ఎంత అలవాటైందంటే రోడ్లమీద నడుస్తూ కూడా ఒకరు చదివితే మిగతావాళ్ళం వింటూ నడిచేవాళ్ళం.

ఇంగ్లీషు సబ్జక్టు 'పాఠాల'దాకా రాలేదు. చిన్నచిన్న రైమ్స్. బాబా బ్లాక్ షీప్, జాక్ ఎండ్ జిల్‌లాంటివీ, కొన్ని పదాలు, వస్తువుల, జంతువుల, పక్షుల పేర్లూ, స్పెల్లింగు ముఖ్యంగనక స్పెల్లింగుల్ని 'రుబ్బే' వాళ్ళం.

యాన్యువల్ ఎగ్జామ్స్ ముందర పెట్టిన మూడు స్లిప్ టెస్టుల్లోనూ నాదే ఫస్టు. మా వాళ్ళందరూ అరవైకి మించే మార్కులు సంపాయించారు.

"వాళ్ళంతా కాపీ కొట్టారు మాస్టారూ? లేకపోతే సింహాద్రికీ మధూగాడికీ అమ్మాజీకి అరవై ఎలా వస్తై?" ఉక్రోషంగా లేచి వీరన్న మాస్టారికి కంప్లైంటు చేసింది కమలకుమారి.

"ఎలా వచ్చినైరా?" వీరన్నగారు సింహాద్రిని అడిగారు.

"కలిసి చదువుతున్నాం మాస్టారూ! " భయంభయంగా అన్నాడు వాడు. ఎందుకంటే, వీరన్నగారు మామూలుగా వున్నంత సేపూ మహా సరదా మనిషి. కొంచెం కోపమొస్తే రుద్రుడే

"ఎవరెవరు?" అడిగారు మాస్టారు.

"మేమంతానండీ. అంటే పాకబడి వాళ్ళమంతానండీ!" నేను లేచి అన్నాను.

"వెరీగుడ్.!" మెచ్చుకున్నారు మాస్టారు.

"మీరు చెప్పమంటే మొత్తం పాఠాలన్నీ చెప్పేస్తామండీ!" గొప్పగా అన్నాను.

"వెరీగుడ్.. మీరు రోడ్లమీద నడుస్తూ కూడా చదవటం నేను చూశాను. ఇలాగే చదివి మన స్కూలుకి మంచి పేరు తేవాలి!" భుజం తట్టి మెచ్చుకున్నారంటే ఇక తిరుగులేదని అర్థం.

ఆ వూపు వూపూ ఫస్టుఫాం పరిక్షలో పూర్తయ్యేదాకా కొనసాగించాలి. పరిక్ష పాసవుతామని అందరికీ నమ్మకం వచ్చేసింది. అయితే ఫస్టు ఎవరికొస్తుందా అన్నదే తేలాలి.

పరిక్షలు అయ్యాక శలవులుంటైగదా. ఆ తరవాతేగదా 'బోర్డు' కట్టేది. అనగా కృతార్థులైన వారి పేర్లూ - కానివారి పేర్లూ బోర్డుమీద అతికించేది. అప్పటిదాకా లోపల ఎంత 'ఇది'గా వున్నా ఆటపాటల మీద మనసుపోతుంది గదా! అందులోనూ ఎండాకాలం గనక యీతలూ, గేదె స్వారీలూ, చిన్న చిన్న మామిడికాయల దొంగతనాలు చెయ్యకపోతే మజానే ఉండదుగదా!

అన్నట్టు టూరింగు టాకీసులో సినిమాలూ మనని ఆహ్వానిస్తాయి గదా. ఆ సినిమాలు చూశాక కత్తియుద్ధాలూ కుస్తీలూ పట్టకపోతే బాగుండదు గదా! ఇహ ఇంట్లో మా 'భాగ్యం' అరిచినా మనకి బేఖాతరేగా!

***సీత.ద.సావిత్రి***

"సురభివాళ్ళు వస్తున్నారంట్రోయ్!" మేవందరం కలవపూల తూళ్ళతో చక్కగా మాలలు చేసి, చల్లగా మెళ్ళో వేసుకుని, చెరువులో కాళ్ళుపెట్టి మామిడికాయ 'ఖైమా' ఆరగిస్తుంటే అన్నాడు దివాకర్‌గాడు. మా చెరువుకి 'కళింగ' వుంది లెండి.

'తీగలవంచ' కరణంగారి ఇంటిముందున్న పేద్ధ ఖాళీ స్థలంలో ఓ డాడ్జి లారీ, బోలెడు బళ్ళూ దిగిపోయాయి. వందల కొద్దీ సరుగుడు వాసాలు, వెదురు బొంగులూ ఇళ్ళు పైకప్పుగా వాడే పెద్ద పెద్ద రేకులూ దించేశారు. అయిదారురోజుల్లో బ్రహ్మాండమైన రేకుల్తో కట్టిన పేద్ధ హాలూ, చుట్టూ రేకుల్తోనే కట్టిన గోడలు, లోపలికి వెళ్ళడానికి రేకుగేట్లూ అన్నీ రెడీ అయిపోయాయి. బెంచీలు కూడా రెడీ. మొత్తం 'తయారీ' అంతా సురభి కంపెనీవాళ్ళదే రెండు నెలలు 'మకాం' వేస్తారట. ఊళ్ళో సందడే సందడి. సతీసావిత్రి నాటకంట.

మొదటిరోజున ఊరిపెద్దలకి ఫ్రీ పాసులిచ్చారు. మా నాన్నకి కూడా. బళ్ళమీద మైకులో (లౌడ్ స్పీకర్) చుట్టు పక్కల ఊళ్ళల్లో కూడా బాగా ప్రచారం చేశారు.

సినిమాహాలు వాళ్ళు గోల. వీళ్ళున్నన్నిరోజులూ సినిమా హాలుకి కలెక్షన్లు వుండవని.

మా పిల్లకాయలం అంతా అక్కడే మకాం పెట్టాం.

"ఒరేయ్.. ఆ పిల్లాడేరా.. తరవాత వెయ్యబోయే హరిశ్చంద్రుడు నాటకంలో లోహితాస్యుడు.!"

"అదిగో ఆవిడే. సతీసావిత్రిలో సావిత్రి వేషం, హరిశ్చంద్రలో చంద్రమతి వేషం వేస్తుందిట!"

ఇలా మా ఇష్టం వచ్చినట్టు పాత్రధారుల్ని వూహించుకుంటూ మాట్లాడుకునేవాళ్ళం. సతీసావిత్రి నాటకం మొదటిరోజున వేశారు. ఆహా.. ఆ కర్టెన్లేవిటీ, ఆ పద్యాలేమిటీ.. ఆ మేకప్పేమిటీ.. నాకు మతిపోయింది. రోజూ వాళ్ళని చూస్తూనే వున్నా, ఒకసారి మేకప్ వేసుకుంటే ఊహించలేని మార్పు. సత్యవంతుడు 'బీడీ' తాగుతూ రోజూ మాతో కబుర్లాడేవాడు. ఇప్పుడు స్టేజిమీద చూడగానే మతిపోయింది. సావిత్రి మాత్రం! సత్తుపళ్ళెంలో అన్నం కలిపి పిల్లలకి తినిపిస్తూ వాళ్ళని కేకలేస్తుండగా వందసార్లు చూశా. ఇప్పుడు ధగధగలాడుతూ, ఆవిడేనా ఈవిడ? అన్నంతగా వుంది.

మానాన్న అమ్మతో మొదటిరోజున 'సతీసావిత్రి' నాటకం చూడటం జన్మలో మర్చిపోలేను. ఆ యముడు వేషం కట్టిన వాడే పై కప్పుకి రేకులు బిగించినవాడు. ఇప్పుడు చూస్తే సాక్షాత్తూ యమధర్మరాజులా కళకళలాడిపోతున్నాడు. దున్నపోతు 'వైరువర్కు'తో నడిచింది.

'పతిప్రాణంబుల్ దక్క' అన్నప్పుడల్లా యముడి హావభావాలు జనాల్ని వెర్రెత్తించినై. ఎందుకూ.. సురభి వాళ్ళ నాటకల గురించి వెయ్యి పేజీలు రాసినా సరిపోదుగదా!

టూరింగ్ టాకీసు వాళ్ళు మాత్రం ఆ రెండు నెలలు లబోదిబోమంటూనే వున్నారు. తారాశశాంకం, సత్యహరిశ్చంద్ర, రాయబారం ఇవన్నీ అప్పుడే చూశా. పెద్దయ్యాక నేను సురభి కంపెనీలో చేరిపోయి పెద్ద 'నటి'ని అయిపోవాలని అప్పుడే అర్జంటుగా నిర్ణయించుకున్నా. ఈ నాటకాల హడావిడిలో వుండగానే మా రిజల్టు వచ్చింది. "బోర్డు కట్టారేవ్!" అంటూ దివాయ్‌గాడు అరవంగానే, తింటున్నదాన్నల్లా చెయ్యికడిగేసుకుని పరిగెత్తా. 'ఫస్టు నువ్వే సీతా!' అని మా సూర్యనారాయణ మాస్టారు చెప్పారు. (ఫస్టు సెకండు ఇవి బోర్డుమీద వుండేవి కాదు. ఆన్సరుపేపర్లిస్తూ ఎనౌన్సు చేసేవాళ్ళు. సూర్యనారాయణ మాస్టారికి నేనంటే చాలా ఇష్టంగనక 'లీక్' చేశారన్నమాట!)

సెక్షన్ 'ఏ'లో ఫెయిలైంది ఇద్దరే. మస్తాన్‌వలీ.., దానియేలు. దానియేలు మేడబడి బేచ్. మస్తాన్ వలీ రేచర్ల బడి బేచ్.

మా 'పాకబడిబేచ్' మొత్తం పాస్. ఏలియాగారి దగ్గరికెళ్ళి యీ 'సువార్త' చెప్పాం. ఆయన ఎంతో ఆనందపడి మాకందరికీ వాళ్ళావిడ పుట్టింటి నించి తెచ్చిన జంతికలూ లడ్డూలూ దిట్టంగా పెట్టించారు. (మేం ఫస్టుఫాంలో వుండగానే ఆయనకి పెళ్ళైంది).

ఫస్టుఫాంలో ఫస్టు.. కుమారి సీత. యీ విషయం క్లాసులో చెప్పగానే మా వాళ్ళంతా ఆనందంగా బల్లలు చరిచారు.

బల్లలు చరవటం గురించి చెప్పకపోతే, స్కూలు 'మజా' తెలీదు. సిలబస్ పూర్తికాగానే మాస్టర్లు ఆనందంగా నవ్వి, "సిలబస్ పూర్తయిందిరా పిల్లలూ.. డెస్కులు మోగిపోవాలి!" అనేవాళ్ళు. ఆ డెస్కులు మీద చేతులు వాచేట్టు చరిచేవాళ్ళం. మొత్తం స్కూలుకి తెలిసిపోయేది. ఫలానా సబ్జక్టు, ఫలానా క్లాసుది, సిలబస్ పూర్తిచేసుకుందని.

అమ్మాజీ దిట్టంగా వుంటుంది గనక యముడు. సత్యవంతుడి పాత్ర చచ్చినట్టు పడుండటమే గనక పార్వతిశం; సావిత్రి ది గ్రేట్ క్రామేడ్ సీత. నందిగం వారి గొడ్లపాకలో నించి దొంగతనంగా ఓ దున్నపోతుని పలుపుతో సహా తోలుకొచ్చేవాళ్ళం.

"ఓయీ యమధర్మరాజా!. మర్యాదగా నా పతి ప్రాణంబులనిమ్ము.. లేనిచో!" నా ఇష్టం వచ్చినట్టుగా డైలాగ్స్ చెప్పేదాన్ని.

"లేనిచో ఏమి చేసెదవు సావిత్రీ.! నీవు కేవలం ఆడకూతురివి. మరి నేనో? యమధర్మరాజుని.. నరకాధిపతిని!"

"ఏమి చేసెదనా? పంచాయితీ వారికి చెప్పి నీ వాహనమును బందెల దొడ్లో పెట్టించెదను!"

"వలదు వలదు.. ఏదేని ఒక కోరిక కోరుకొమ్ము.. ఇచ్చెద.! పతి ప్రాణంబులు దక్క.."

"నా మెల్ల కన్ను సరిచెయ్యమని అడగవే సీతా!" కళ్ళు మూసుకుని చచ్చిపడి వున్నవాడిలా యాక్టు చేస్తూనే గుసగుసగా అడిగేవాడు పార్వతీశం.

"అలాగేరా.. అలాగే అడుగుతా" అని వాడితో చెప్పి, "నా పతియగు యీ సత్యవంతునికి మెల్ల కళ్ళ బదులు మంచి కళ్ళు ప్రసాదించు ధర్మవర్తీ..సమవర్తీ!" అని యమధర్మరాజునడిగేదాన్ని.

"ఓసీ.. పిచ్చి సావిత్రీ.. చచ్చినవాడి కళ్ళు 'మెల్ల'గా వున్ననేమీ, మంచిగా వున్ననేమీ.. మరేదేని వరము కోరుకొమ్ము.! పతిప్రాణంబులు దక్క!"

"సరే.. వృద్ధులైన అత్తమామలకు..."

"ఒసేయ్.. నందిగం వాళ్ళ పాలేరొస్తున్నాడేవ్.!" అంటూ యమ పాత్రధారిణి దున్నపోతు మీదనుంచి దూకి చెరువువైపు పరిగెడితే, నేను అచ్చిరెడ్డి వాళ్ళ వీధిలోకి పరిగెత్తా.. పార్వతీశంగాడు మాత్రం దొరికిపోయాడని వాడి కేకల్ని బట్టి తెలిసిపోయింది. నందిగం వాళ్ళ పాలేరు మహా తిక్కలోడు.

"నేనిక ఛస్తే నీ జట్టుకట్టనే! ఆ పాలేరు వెధవ నన్ను పట్టుకుని మా ఇంట్లో వొప్పగించాడు నా వీపంతా మా నాన్న కొట్టిన దెబ్బలకి వాచిపోయింది. ఛో.. ఇక నీకూ నాకూ నో ఫ్రెండ్షిప్.!" మరుసటి రోజున ఏడ్చాడు పార్వతీశం. కానీ మేం మళ్ళీ సత్యహరిశ్చంద్ర నాటకం మొదలెట్టగానే, "నక్షత్రకుడి వేషం నేనే వేస్తానే సీతా!" అంటూ తెగ బతిమలాడాడు.

***కాడెడ్లు X కంకి కొడవలి.***

"ధరలు మండ బెట్టేస్తున్నారు... సర్కారుకి పోయేకాలం వచ్చింది. తెల్లోళ్ళు పరిపాలనే బాగున్నట్టుంది చూస్తే!" భుజం మీద కండవా దులిపి మళ్ళీ వేసుకుంటూ అన్నాడు కూరాకుల వెంకయ్య.

"యీ కాంగ్రేసోళ్ళు వచ్చి వూడబొడిచిందేమిటీ? అదే మా కమీనిస్టులైతేనా? " కాంగ్రేసు 'కనకాచలాన్ని' చూస్తూ యీసడించాడు కమీనిస్టు పోలయ్య.

"ఏం చేస్తాం.! పప్పులూ వుప్పులూ మానిక్కి అర్ధరూపాయి పెరిగాయి. ఇహ బియ్యం మానెడుకీ పావలా పెరిగింది నూనె వీశ ఆరణాల్నించి, ఏడు అణాలకి పెరిగింది. కిరసనాయిలైతే మరీ ఘోరం. 'కాయ' బేడన్నర నించి పావలాకి పెరిగింది. బీదా బిక్కీ ఏం తిని బతుకుతారూ?"

ఇదీ.. కిష్టయ్య హోటల్ దగ్గర మా నాన్నతో పాటు నేనూ పెసరట్టుప్మా తింటున్నప్పటి జన ఘోష.

మా అమ్మ ఇంట్లోకి రాని మూడురోజులూ నాకు పండగే. భోజనం వరకూ నాన్నే వొండుతారుగానీ, టిఫిన్లు చెయ్యటం ఆయనకి రాదు.

మా అమ్మ ఎలాగూ 'హోటల్ సరుకు' తినదు గనక ఆవిడకి పొద్దున్నే అరిటాకులో వడ్డించేశాక మేమిద్దరం ఇలా హోటల్లో టిఫిన్లు బిగిస్తామన్నమాట.

కాంగ్రెసు పార్టీ తరఫునించి నిలబడింది. మోతే వేదకుమారిగారు కమ్యూనిస్టు తరఫునించి నిలబడింది వీరమాచినేని విమలాదేవి. ప్రచారాలు జోరుగా సాగుతున్నై. ఎలక్షన్లు ఏమిటో, అవెందుకొస్తాయో మాకు తెలీదుగానీ, ప్రచారం మాత్రం మహారంజుగా వుండేది. మా మాస్టర్లు కూడా రాజకీయాలు మాట్లాడుకునేవాళ్ళు. ఇహ మేమైతే ప్రచారకర్తల్ని తెగ అనుకరించేవాళ్ళం.

ఉదా: మా కాంగ్రేసు వీరాచారి ఎలా మాట్లాడతాడో చిత్తగించండి.

"సోదర సోదరీమణులారా.. మీరంతా మన ప్రియతమ నాయకుడు శ్రీశ్రీశ్రీ జవహర్‌లాల్ నెహ్రూ గారికే ఓటు వెయ్యాలి. ఆయనంత తెలివైనవాడు మరొకడు యీ దేశంలో కాదుగదా, హోల్ ప్రపంచంలో లేడు. కాంగ్రెసుకి ఓటేస్తే గాంధీగార్ని గౌరవించినట్టే. కాడెద్దులకే మీ ఓటు."

ఇహ మా కమీనిస్టు పోలయ్య" "కామ్రేడ్స్.! కమీనిస్టు పార్టీ ఒక్కటే నిఖార్సైన పాలన అందించగలదు. అటు రష్యాలో ఇటు చైనాలో ఇంకా ఎన్నెన్నో దేశాల్లో ప్రగతి సాధించింది... కంకి కొడవలికే మీ ఓటు!" దీనికి మా పేరడీలు చిత్తగించండి.

"సోదర సోదరీమణులారా! మెల్లకళ్ళ పార్వతీశం గాడికే మీ ఓటు. వాడు అన్ని వైపుల్నీ సమానంగా ఒకేసారి చూడగలడు. ఇంకా ఎంతో మంచివాడు తన్నినా కొట్టినా మాట్లాడడు గనక వాడికే ఓటు వేసి వాణ్ని మనం మన మానిటర్‌గా ఎన్నుకోవాలి.. జై పార్వతీశం..."

"కామ్రేడ్స్.. మన స్కూలు మొత్తంలో గొప్పవాడు కిర్రు చెప్పుల మధూగాడు! వాళ్ళ నాన్నకి కిరాణా కొట్టుంది. వాణ్ని ఎన్నుకుంటే అందరికీ రోజా పప్పు బెల్లాలు వుచితంగా పంచిపెడతాడని ఘంటాపథంగా వాడి తరఫున మాట ఇస్తున్నా.. జై కిర్రుచెప్పుల మధుసూదనరావ్!"

ఇలా ఓ రోజున హాయిగా మేం అనుకరించి నవ్వుకుంటుంటే, "ఏరా శేషాచారీ.. నువ్వు పార్వతీశంగాడికి వంతా?.. రా.. గాంధీ టోపీ పెడతా.., ఏరా జోగారావ్వూ, నువ్వు కామ్రేడువా? రారా కామ్రేడ్ నీకే ఓటేస్తా!" అంటూ మా హింది సుబ్బరాజు మాస్టారు పేక బెత్తాంతో వాళ్ళ వీపులు సాఫు చేశారు.

అంతే పాలిటిక్స్ బంద్! పాలిటిక్సు 'ఆట' ఆడినా చెరువుగట్టు దగ్గరే తప్ప ఇళ్ళల్లోనూ స్కూళ్ళల్లోనూ బందైపోయింది. పెద్దవాళ్ళు మాత్రం తెగ వుత్సాహంగా మాట్లాడుకునేవాళ్ళు. బహిరంగ సభలు జరిగేవి. వేరే వేరే వూళ్ళ నించి 'వక్తలు' వచ్చి ఉపన్యాసాలిచ్చేవాళ్ళుగానీ, మా పిల్లల్ని మాత్రం ఆ ఉపన్యాసాల దగ్గరికి పోనిచ్చేవాళ్ళు కాదు. వెడితే 'తలంటే!'

'ఫస్టుఫాం' నించి సెకండు 'ఫాం'కి రావడం గ్రేటే. సిలబస్ కొంచెం ఎక్కువ. హిందీ అక్షరాలు కూడా దిద్దాలి. అంతేగాక సంస్కృతమో తెలుగో ఏదో ఒకటి తీసుకోవాలి.

పుష్పకుమారీ, జయలక్ష్మీ, విజయలక్ష్మీ వీళ్ళంతా సంస్కృతం తీసుకుని 'శబ్దమంజరిని' రుబ్బుతుంటే, మేం తెలుగు 'టూ' కనక బేఫికర్‌గా వుండేవాళ్ళం. మా తెలుగు మాస్టారు వైద్యుల కృష్ణారావుగారి పేరు చెప్పుకోపోతే పప్పులో వుప్పులేనట్టే. అద్భుతంగా, రాగయుక్తంగా పద్యాలు చదివి అర్థాలు చెప్పేవాళ్ళు. సరదాగా ఆయన పద్యాలు కట్టి మమ్మల్ని నవ్వించేవారు.

ఒకసారి నేను క్లాసులో టిఫిన్ ఎక్కువ తినడం వల్ల జోగుతుంటే,

"పీరు సాహెబు భార్య
శ్రీమతి ఫాతిమా సుల్తాను మగని
కొబ్బరీనెల చీపురుచ్చుకు
పొద్దునే వాయించుచున్నది.. మేలుకో." అని రాగయుక్తంగా పాడారు.

వన్స్‌మోర్ అని పిల్లలు హుషారుగా బల్లలు చరచగానే,

"నిన్న మిగిలిన చిల్లుగారెలు
వేడి సాంబార్‌లోన ముంచీ
కష్టమర్లకు అమ్ముచున్నా
డదిగో హోటల్ కృష్ణమూర్తీ.. మేలుకో!" అని ఇంకో పద్యం ఘంటసాలగారి టైప్‌లో పాడారు మా కృష్ణారావు మాస్టారు.

ఆ రెండు గీతాలూ తరవాత ఆయనచేతే రాయించుకుని మహా గొప్పగా మా ఇంట్లో చూపించా.., సందర్భం వివరించి మరీ.

"భలే బావుందే సీతా! తెలుగు మాస్టారి చేత పద్యాలు రాయించుకున్నావంటే రేపు పెద్దయ్యాక చాలా గొప్పదానివైపోతావే!" అని మా నాన్న నవ్వుతూ ఎంకరేజ్ చేస్తే, "హూ.! క్లాసులో అది నిద్దరపోయిందని సిగ్గులేదుగానీ, తెగ ములగచెట్టు ఎక్కిస్తున్నారు. ఇట్లా అయితే అది బాగుపడ్డట్టే!" అని మొహం మటమటలాడించింది. నాకు కోపం వచ్చిందంటే రాదూ! మా నాన్న మొహం చూస్తూ "నాన్నా!. యీ పెద్దపాడు మాలక్ష్మి కూతురు నిజంగా నా తల్లేనా?" అనడిగాను.

"అయ్యయ్యో! అయ్యయ్యో.! ఎంతమాటన్నావే భడవా? నీ కాళ్ళు విరిచి పొయ్యిలో పెట్టకపోతే నా పేరు భాగ్యలక్ష్మేకాదు!" అనుకుంటూ నామీద కొచ్చింది.

"ఖచ్చితంగా నువ్వు నా తల్లివి కావని రుజువైపోయిందే మాలక్ష్మి కూతురా. లేకపోతే ఏ తల్లయినా కూతురి కాళ్ళు విరుస్తుందిటే?" ఆవిడకి దొరక్కుండా బయటికి పరిగెత్తాను.

అప్పుడప్పుడూ ఇలాంటి వేషాలు వెయ్యకపోతే 'మనం' మరీ పలచనైపోమూ! ఆ వెళ్ళటం వెళ్ళటం ఆశ్రమానికి పోయి ప్రసాదవితరణ జరిగేదాకా వుండి, ఓ పేద్ద విస్తరాకులో పులిహోరా, గారెలూ పేక్ చేసుకుని రాత్రి తొమ్మిదింటికి ఇంటికొచ్చా.

నేనేమైపోయానో అని మా అమ్మ ఒకటే 'లబోదిబో!' నేనూ బెట్టు వదలకుండా, "నన్ను కనని వాళ్ళ దగ్గర కటిక వుపవాసమైనా వుంటాగానీ, బంగాళా దుంప వేపుడూ తెల్ల నువ్వులు వేసి చేసిన బీరకాయ పచ్చడీ తయారు చేసి పెట్టినా దానివంక చూడనైనా చూస్తానా? ప్రాణం పోయినా యీ సీత మాట దాటదు!" అని గంభీరంగా అన్నాను.

దానికి అర్థం బంగాళదుంప వేపుడూ, నువ్వు పొడివేసిన బీరకాయ పచ్చడీ చేసి పెడితేనేగానీ నా అలక తీరదని. ఆ విషయం మా అమ్మకి బాగా తెలుసు. ఆ నైటు మనది రాజభోజనం. పులిహోరా గారెలు విత్ స్పెషల్స్.

### *ద గ్రేట్ రాబరీ*

ఒకానొక ఆదివారం రేపొస్తుందనగా, ఇవ్వాళ అంటే శనివారం మధ్యాహ్నం పాకబడి వాళ్ళం అందరం కలిసి 'పునాస మామిడికాయల' సామూహిక దొంగతనం గురించి ప్లాన్ చేశాం మా ఊరికి పక్కనే వున్న తుంగగూడెం వాస్తవ్యుడైన కోమటి గురవయ్య తోటని 'స్పాట్'గా నిర్ణయించాం. శుక్రవారం రోజునే మద్దిమత్తెనగాడూ, మధూగాడూ అమ్మాజీ, సింహాద్రి పార్వతీశం డొంకాడ అందరూ వెళ్ళి 'సర్వే' చేసొచ్చారు.

"లాభం లేదే! తోటమాలి సుబ్బన్నగాడ్ని నిముషంలో ఏమార్చవచ్చుగానీ, ఇంట్లో వాళ్ళ అల్లుడూ కూతురూ కూడా వున్నారు. అదీగాక చెట్టేమో తోట మధ్యలో వుంది. పట్టుకుంటే అయిపోతాం!" అని రిపోర్టిచ్చాడు మధూ.

"ఎవరూ లేనప్పుడు 'చోరీ' చేస్తే కాయలకి 'రుచి' రాదురా మధూగా! చేస్తే ఇలాంటప్పుడే చేసి మన మన 'ప్రజ్ఞ' నిరూపించుకోవాలి!" అన్నాను నేను.

ఓ విషయం మీకు ఇప్పుడు చెప్పకపోతే, ఎప్పటికీ తెలీదు. ఆ రోజుల్లో అన్నికూరలూ కాయలూ అన్ని సీజన్నుల్లోనూ దొరికేవి కాదు. అందుగురించి సీజన్లో పండేవాటిని 'ఒరుగు'లుగా తయారుచేసేవాళ్ళు. బెండకాయ ఒరుగు, వంకాయ ఒరుగు, మామిడికాయ ఒరుగు ఇట్లా ఒరుగులు చేసేవాళ్ళు - అంటే, కూరల్ని ముక్కలుగా తరిగి, ఉప్పూ పసుపూ కలిపి, కొంచెం రసం దిగాక దాన్లో వూరనిచ్చి ఎండబెట్టేవాళ్ళు. ఊరమిరపకాయల్లాగా. అవి బాగా ఎండాక సీనారేకు డబ్బాల్లో పోసి గాలిచొరకుండా 'వాసెన' కట్టేవాళ్ళు. అలాగే వడియాలూ అప్పడాలూ కూడా ఎండబెట్టి డబ్బాల్లో గాలిచొరకుండా దాచేవాళ్ళు.

అన్ సీజన్‌లో నాలాగా మీకు మామిడికాయ పప్పు తినాలనిపించింది అనుకోండి. అటక మీదనించి మామిడి ఒరుగు దించి, కావల్సినంత పరిమాణం మేరకి నీళ్ళల్లో నానేసి ఆ తరవాత ఉడికే పప్పులో యీ ఒరుగుని పడేస్తే, మామిడికాయ పప్పు తయారవుతుందన్నమాట. ఈ ఒరుగుతో చేసిన పప్పు ఇనుమడించిన రుచితో ఇంకా ఘుమఘుమలాడుతుందన్నమాట.

మామూలు మామిడికాయలు కాకుండా 'పునాసమామిడి' అని ఓ రకం వుండేది. ఆ చెట్టు మామిడి చెట్టే అయినా దాని ఆకులు సన్నం. అది అన్‌సీజన్‌లో మావిడికాయల్ని కాసేది. వాటిని పునాస మామిడికాయలనే వాళ్ళు. ఖరీదు కొంచెం ఎక్కువ. అంటే ఒక కాయ అణానో అణన్నరో వుండేది. ఆ రోజుల్లో అణన్నర పెట్టాలంటే కష్టంగదా!

ఫ్రెష్ మామిడికాయ పప్పు తినాలంటే, కొద్దోగొప్పో 'రిస్కు' తీసుకోక తప్పదుగదా! అందులోనూ నాకు మామిడికాయ పప్పంటే ఆరోప్రాణంకదా!

ఇంట్లో ఎంత మామిడి ఒరుగువున్నా, ఆ ఒరుగు నవనవలాడే పచ్చికాయతో పోటీ పడలేదుగదా! అందుకే కోవటి గురవయ్య తోటని ఎంచుకున్నది.

అనుకున్న ప్రకారం పార్వతీశంగాడు తోటమాలి సుబ్బన్నని 'మాటల్లో' దించాడు. మేమంతా చెరువువైపు నించి కంచెలో దూరి తోటలో ప్రవేశించాం. మధూగాడు చకచకా చెట్టెక్కేశాడు. కాయలు తెంపి పడేస్తుంటే నేనూ, డొంకాడగాడూ, మద్ది మత్తెనోడూ గబగబా వాటిని గోనెలో పడేస్తున్నాం. (అన్నట్టు మిగతావాళ్ళు అంటే అమ్మాజీ, సింహాద్రి ఎట్సెట్రాలు మధ్యలోనే జారిపోయారు... పిరికిపందలు!)

మన 'లక్' సరిలేక మధుగాడ్ని 'కరెంటుచీమలు' పట్టుకున్నై. అవి కుడితే నా సామిరంగా బొబ్బలూ మంటలతో పిచ్చెక్కుతుంది.

"కరెంటు చీమలేవ్!" అని అసంకల్పితంగా వాడు అరవటం, సుబ్బన్న వాళ్ళ అల్లుడూ కూతురూ, పెళ్ళాం, డుబ్బుక్కున పరిగెత్తుకురావడం, మధూగాడు పై కొమ్మలమీద ఉండటంతో దూకలేకపోవడం, యీ యొక్క కారణాలవల్ల మేం పట్టుబడక తప్పిందికాదు.

పారిపోవటానికి నాకు ఛాన్సు దొరికినా 'ఒక క్కామ్రేడ్' మడమతిప్పటం అంటే ప్రాణం త్యజించినట్టే, అని చదవబట్టి అక్కడే ఆగాను.

ఇంతకీ గోనెలో వున్నవి ఏడుకాయలు. అసలు ఎన్ని పక్షులు కాయలు కొరకడంలేదూ? ఎన్ని కాయలు గాలివానలకి రాలిపోవడంలేదూ.

క్షణాల్లో యీ 'వార్త' నాలుగూళ్ళకీ పాకింది. మమ్మల్ని గాట్టిగా పట్టుకుని 'తుంగగూడెం' ప్రెసిడెంటుగారి ఇంటికి తీసుకుపోయారు. ఆయన వుండేదీ మా వూళ్ళోనే. ఇక చూడు నాయనా...

"మా తోటలో గెలలకి గెలలు వీళ్ళే కోసుకుపోయారు." అని ఒకరు

"మా జామచెట్టు మీద 'పిందె'కూడా వీళ్ళు నిలవనివ్వడంలేదు!" అని మరొకరు.

"ఆ సీతని చూడండి...ఎలా చూస్తోందో.. దొంగలకి దొంగకాదూ?" అని ఓ నాపసాని,.. ఇలా ఎవరికి ఇష్టం వొచ్చినట్లు వాళ్ళు కామెంట్లు విసురుతున్నారు. ప్రెసిడెంటుగారి మండువా అంతా జనాల్తో నిండిపోయింది.

మా నాన్నకీ మిగతా 'ఫ్రెండ్స్' తల్లిదండ్రులకీ కబురెళ్ళింది. మా నాన్న నన్ను చూస్తూనే, 'ఫరవాలేదులే' అన్నట్టుగా నవ్వాడు.

మిగతా వాళ్ళు మాత్ర వచ్చీరాంగానే పిల్లల్ని బాదటం మొదలెట్టారు. మద్దిమత్తినోడి తల్లి ఐతే, "నీకిదేం పొయ్యేకాలంరోయ్.. వీళ్ళతో కలిసి ఎందుకు చెడుతున్నావురోయ్.. నా కడుపున చెడబుట్టావు కదురోయ్.. ఇక నా మొహం వీధిలో వాళ్ళకి ఎలా చూపించేది

రోయ్.!" అంటూ రాగయుక్తంగా శోకాలు మొదలెట్టింది. వాళ్ళూ వీళ్ళూ ఎంత సముదాయించినా ఆవిడ శోకాలు ఆగవాయే! ఆవిడ ఆపితేనే గానీ 'పంచాయితీ' జరగడానికి వీల్లేదాయె చివరికి ప్రెసిడెంటుగారు కళ్ళెర్ర చేస్తేగానీ ఆవిడ ఏడుపు మానలా.

ప్రశ్నలు మొదలయ్యాయి.

"నిజం చెబితే శిక్ష తగ్గుతుంది! దొంగతనం చేశారా?" తీక్షణంగా అందరి కళ్ళల్లోకి చూసి అన్నారు ప్రెసిడెంటుగారు.

"ఉహూ.! నాలుక్కాయలు, అంటే, మొత్తం ఏడుకాయలు కోశాం సార్.. అంతే!" అన్నాను నేను.

"దీనికి మీరేమంటారు ప్లీడరుగారూ?" గంభీరంగా మా నాన్నని చూస్తూ అడిగారు ప్రెసిడెంటుగారు.

"ఏదో చిన్నతనం. కావాలంటే రూపాయో రెండో జరిమానా కట్టేస్తాం!" అన్నాడు మా నాన్న.

"అదెట్టా కుదురుద్దీ? యీళ్ళ వల్ల నాకు జరిగిన నష్టం రూపాయీ రెండుతో పూడుద్దా? కనీసం అయిదొందలిస్తేగానీ వదల్ను!" అన్నాడు కోవటి గురవయ్య.

"అయిదొందలా? మొత్తం నీ అరెకరం లేని తోటలో కాయలన్నీ అమ్మినా 'వంద'కి కొనరు. అంత ఆశ పనికిరాదయ్యా కోవటాయనా!" అన్నాడు మా శివాలయం పూజారిగారు.

"తగ్గేదిలేదు.... పిల్లలుగలోడ్ని. మీరే దయసూడాల పెసిరెంటుగోరూ," అన్నాడు చేతులు పిసుక్కుంటూ గురవయ్య.

"దొంగతనం నేరం. అదీ యీ వయసులో! ఇప్పుడు వీళ్ళని క్షమించి వదిలేస్తే పెద్దయ్యాక వీళ్ళు గజదొంగలౌతారు!" మా వంక గుర్రుగా చూస్తూ గంభీరంగా అన్నాడు ప్రెసిడెంటు.

ఓ సారి ఎప్పుడో వాళ్ళబ్బాయికీ మాకూ గొడవొచ్చి, వాడి వీపు చప్టాగా సాఫు చేశామని నాకు గుర్తొచ్చింది. అమ్మో.! ఆ కక్ష ఇప్పుడు తీర్చుకుంటే?

"అదేమిటి ప్రెసిడెంటుగారూ.! పిల్లలన్నాక ఇది మామూలే. ఏం మీరూ నేనూ కూడా ఇట్లాంటి చిలిపి పనులు చెయ్యకుండానే పెద్దవాళ్ళమయ్యామా? ఏదో పిల్ల చేష్టలని తేలిగ్గా తీసుకోవాలేగానీ, వీళ్ళేదో 'కన్నం' వేసి దొంగతనం చేసినట్టు భావిస్తే ఎలా?" అనునయంగా అన్నాడు మా నాన్న.

"ప్లీడరు అయ్యుండీ మీరిట్లా మాట్లాడకూడదు. సత్ప్రవర్తన అనేది చిన్నతనం నించే నేర్పాలి. నేనేనాడూ, ఆఖరికి నా చిన్నతనంలోకూడా ఇటువంటి చట్టవ్యతిరేకమైన పనులు చెయ్యలేదు. అతి చిన్న వయసులో కూడా ఊరి ప్రజలకి 'ఆదర్శం'గానే వున్నాను. అందుకే మా ఊరికి ప్రెసిడెంటుని కాగలిగాను! ఇక్కడ పట్టుబడ్డ అయిదుగురూ, తలో పాతిక రూపాయలూ 'తప్పు' కట్టడమేగాక, ఇకనించి ఇటువంటి తప్పు చేయమని అందరి కాళ్ళూ పట్టుకుని ప్రమాణం చెయ్యాలి. ఇదే నా తీర్పు." మా నాన్న వంక చూస్తూ అన్నాడు ప్రెసిడెంటు.

మా నాన్న మొహం వెలవెలా పోయింది. డబ్బు అయితే కట్టగలడుగానీ నా చేత ఊరివాళ్ళ అందరి కాళ్ళూ ఎలా పట్టిస్తాడూ? అంత అవమానాన్ని ఎలా ఓర్చుకోగలడూ? నాకు పిచ్చి కోపం వచ్చింది. గుర్రుగా ప్రెసిడెంటు వంక చూస్తూ, "ఛస్తే నేను ఎవడి కాళ్ళూ పట్టుకోను. ఇంతకీ మేం కోసింది మొత్తం ఏడుకాయలు. ఎన్ని కాయలు చెట్టుమీంచి రోజూ రాలిపడటంలేదూ? అసలీ తోటమాలి సుబ్బన్న రోజూ ఎన్ని కాయలు దొంగతనంగా అమ్మట్లేదూ? గురవయ్యా, నువ్వెంత పిసుక్కుచచ్చినా ఒక్క కానీ కూడా మా నాన్నని కట్టనివ్వను. దొంగ లెక్కలు రాసీ, దొంగ కొలతలు కొలిచీ ఎంతమంది డబ్బు అన్యాయంగా కొట్టేస్తున్నావో నాకు తెలీదా, యీ ఊళ్ళో వాళ్ళకి తెలీదా? ఏవండీ ప్రెసిడెంటుగారూ, అవాళ మీరు 'బోడెమ్మ' ఇంట్లో దూరితే నేను చూశానని, నాకు బిస్కెట్లు కొనిపెట్టి ఎవరితో చెప్పొద్దని మీరు నాతోటి ఒట్టు వేయించుకోలేదా?" అని గట్టిగా అరిచా.

అంతే... 'క్షణాల్లో ప్రెసిడెంటుగారి భార్య గడప ఇవతలికొచ్చి ఆయన రెక్కపట్టుకుని లోపలికి 'గుంజు'కు పోయింది. (ఆస్తి అంతా ఆవిడదేట.)

"దొంగతనంగా కాయలమ్ముతావ్రటా గుడిసేటి నాయాలా?" అంటూ వీరావేశంతో సుబ్బన్న మీదకి దూకాడు గురవయ్య. జనాల్లో నోళ్ళు నొక్కుకున్న వాళ్ళు కొందరైతే, ప్రెసిడెంటు ఇంటివైపు చూస్తూ ఎకసెక్కాలాడిన వాళ్ళు ఇంకొందరు.

పంచాయితీ మధ్యలోనే ఆగిపోయింది. ఎవరిళ్ళకి వాళ్ళు నవ్వుకుంటూ పోయారు.

"అయినా సీతాలూ.. నీకింత కోపం ఎందుకొచ్చిందే?" ఆశ్చర్యంగా అడిగాడు మా నాన్న.

"నువ్వు కూర్చోడానికి కుర్చీ అయినా వేయించలేదుగా! అందుకే కోపం వచ్చింది!" అన్నాను.

మా నాన్నకి ఆ మాటలు వినగానే మహా ముద్దొచ్చింది. నన్ను ఎత్తుకుని మరీ ఇంటికి తీసికెళ్ళాడు.

కానీ ఏం లాభం? మా అమ్మ నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా మూ్డ్రోజులపాటు తిడుతూనే వుంది.

కష్టాలొస్తే 'ఒంటరి'గా కాక 'గుంపులు'గా వస్తాయంటారు. నా విషయంలో అదే జరిగింది. బైటికి పోతేచాలు.. నేనేదో 'రౌడీరాణీ అమ్మా బాబు'ని అన్నట్టు చూసి ముక్కులూ మూతులూ విరిచేవాళ్ళు.

"నువ్వు 'ఇందు'లో ఫస్టేనన్నమాట!" అని మాస్టర్లూ హేళనగా అనేవాళ్ళు. ఇహ అయిదో రోజునైతే చుట్టపుచూపుగా వచ్చిన మా అమ్మ వేలు విడిచిన మేనమామా, ఆయన పరివారం చెవులు వాచేట్టు నాకు నీతులు చెబుతూనే వున్నారు. మా అమ్మ ఇంకా రెచ్చిపోయి, "కాదు మావయ్యా! దీనికి వాళ్ళనాన్న వత్తాసు. ఒక్కమాట అనడానికి వీల్లేదు" అని చిలవలు పలవలుగా నా యొక్క 'దుష్ప్రవర్తనని' వాళ్ళవాళ్ళకి 'చెవులారా', యీవిడ 'నోరారా' వర్ణించింది. మానాన్న నావైపు నించి ఎంత ఆర్గ్యూ చేసినా ఆవిడ వినిపించుకుంటేగా. మా అమ్మ మేనమామ పత్తిత్తులాగా, "అమ్మాయ్ భాగ్యం.! ఇవన్నీ వంశపారంపర్యంగా వచ్చే లక్షణాలని సైన్సు ఘోషపెడుతోంది!" అన్నాడు. ఆయన ఓ ఆరెంపీ డాక్టరు దగ్గర కాంపౌండరు.

"మీరందరూ ముచ్చుమొహాలనీ., మీవన్నీ కుళ్ళుబుద్ధులనీ, మీకసలు మంచిగా మాట్లాడటమేరాదనీ, సైన్సేకాదు, తెలుగూ ఇంగ్లీషూ సోషలు మేథ్సూ హిందీ అన్నీ చెబుతున్నై. మీరందరూ మహా పత్తిత్తులూ, నేనూ మా నాన్నా దొంగలం. అంతేగా? మీరనేదీ? మీ ఇంట్లో మీరే తినండి. మా చోరీ సొత్తులు మీకెందుకూ? పదనాన్నా పోదాం!" అని మా నాన్నని బయటికి లాక్కొచ్చా. ఆయన ఎంత గొప్ప ప్లీడరైనా మొహమాటం ఎక్కువ.

"చుట్టాల్ని అలా అనకూడదే సీతా..! వాళ్ళు బాధపడతారు.. అతిథి దేవోభవా అని చదవలా?" ఇబ్బందిగా అన్నాడు మా నాన్న.

"భాగ్యలక్ష్మిగారి పుట్టింటోళ్ళకి సిగ్గెక్కడిదీ! టిఫిన్ చేసొద్దాం పదనాన్నా!" అని క్రిష్టయ్య తోటలోకి లాక్కుపోయా. వాళ్ళెలాగూ తింటారు. మధ్యన నేనూ మా నాన్నా ఎందుకు మాడాలీ?

(మళ్ళీకలుద్దాం)

Post your comments